నేడు ప్రజావాణి

సికింద్రాబాద్, జనవరి 28: సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని జడ్సీ రవికిరణ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం పదిన్నరకు కార్యక్రమం ప్రారంభమై మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమానికి హాజరై తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల అధికారులు పాల్గొంటారని, సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమం దోహదపడుతుందన్నారు.

– సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు డీసీ సుధాంష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజావాణి కార్యక్రమం ప్రజల సమస్యలు తీర్చడానికి, తక్షణ పరిష్కార మార్గం చూపడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం ప్రతి సోమవారం ఉదయం పదిన్నర నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటుందన్నారు.

నిధులు కేటాయించాలి..

హిమాయత్‌నగర్,జనవరి 28: రాష్ట్రంలోని బీసీలు,కుల వృత్తుల అభివృద్ధి సంక్షేమం కోసం బడ్జెట్‌లో రూ.25వేల కోట్లు కేటాయించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హిమాయత్‌నగర్ లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీసీ కుల గణన చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలన్నారు.

సంత కష్టాలకు చెక్..!

- కోర్టు ఆదేశాలతో పోలీసులు పరిష్కార చర్యలు
- జెక్‌కాలనీలోకి రాకుండా అడ్డుగా రేకులు..
- బయటనే క్రయ, విక్రయాలు

కోళ్ల విక్రయాలు జరిగే ప్రదేశంలో అడ్డుగా షీట్‌ను ఏర్పాటు చేసిన కాలనీ ఫెడరేషన్ ప్రతినిధులు

అమీర్‌పేట్, జనవరి 28 : కొన్నేండ్లుగా ఎర్రగడ్డ ఆదివారం సంతతో ఇబ్బందులు పడుతున్న సనత్‌నగర్ జెక్ కాలనీ వాసులకు సమస్య పరిష్కారం దిశగా అడుగులు పడుతున్నాయి. ఆ దిశగా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఆదివారం వచ్చిందంటే సంత లోని జెక్ కాలనీ రోడ్లకు అతి సమీపంలో జరిగే మేకలు, గొర్రెలు, నాటు కోళ్ల విక్రయాలు కాలనీవాసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తుండేవి. మా కాలనీలోకి సంత పేరుతో అక్రమంగా చొచ్చుకువస్తూ మా ప్రశాంతతకు భంగం వాటిల్లేలా చేస్తున్న మేకలు, కోళ్ల విక్రయాలను నియంత్రించాలని కోరుతూ కాలనీ ఫెడరేషన్ ప్రతినిధులు చివరకు కోర్టు, మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించాల్సి వచ్చింది. అక్కడి నుంచి వచ్చిన ఆదేశాల మేరకు పోలీసు అధికారులు స్పందించి.. సమస్య పరిష్కార దిశగా అడుగులు వేశారు. రెండు వారాల క్రితం బాలానగర్ ఏసీపీ వచ్చి సంతలో నెలకొన్న మేకలు, కోళ్ల విక్రయాల పరిస్థితులను సమీక్షించారు. చివరకు విక్రయాలు జరిగే ప్రదేశం నుంచి కాలనీలోకి వెళ్లే మార్గాన్ని మూసి వేయడం ద్వారా సమస్య పరిష్కారమవుతుందన్న ఏసీపీ సూచనల మేరకు కాలనీ నివాసితులు భారీ షీటుతో అడ్డుగా గోడను నిర్మించుకున్నారు. దీంతో విక్రయదారుల బెడద తప్పింది. రెండు వారాలుగా పోలీసుల పహారాతో విక్రయదారులు, కొనుగోలుదారులకు కాలనీకి ఎంట్రీ లేకుండా చేయడంతో ప్రశాంత వాతావరణం నెలకొందని కాలనీ ఫెడరేషన్ అధ్యక్షుడు డాక్టర్ మల్లు ప్రసాద్ చెబుతున్నారు. కాలనీ వాసులు వంతుల వారీగా ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీసులకు పికెట్ల వద్ద పరిస్థితులను సమీక్షిస్తూ గడపాల్సి వస్తోందని, కొద్ది వారాల్లో సమస్య పరిష్కారమవుతుందని ఆశిస్తున్నామని, సమస్య పరిష్కారంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ తోడ్పాటు మరువలేనిదని డాక్టర్ మల్లు ప్రసాద్ పేర్కొన్నారు.

కోళ్ల విక్రయాల కోసం కేటాయించిన స్థలంలో అమ్మకాలు జరుపుతున్న వ్యాపారులు

శుభాకాంక్షలు..

ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌ను సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఆదివారం నాంపల్లిలోని గాంధీ భవన్‌లో సికింద్రాబాద్ సీనియర్ నాయకుడు మహ్మద్ వాహిదుద్దీన్ ఆధ్వర్యంలో నాయకులు ఎమ్మెల్సీని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపి.. సన్మానించారు.

- సికింద్రాబాద్, జనవరి 28

బీసీ యువజన సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ యువజన సంఘం ప్రతినిధులు

బేగంపేట్, జనవరి 28: రాష్ట్ర బీసీ యువజన సంఘం 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం బీసీ భవన్‌లో ఆవిష్కరించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్య సమావేశంలో బేగంపేట్‌కు చెందిన మన్నె వెంకట్ ముదిరాజ్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలం వెంకటేశ్, ఈబీసీ యువజన సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ రామకృష్ణ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జు కృష్ణ, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు భరత్‌కుమార్ సుధాకర్, అనంతయ్య, రాజ్‌కుమార్, శివకుమార్, నందగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

తలసాని ప్రీమియర్ లీగ్ విజేత నాంపల్లి భరత్ సీసీ టీమ్

అమీర్‌పేట్ జీహెచ్ఎంసీ మైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో నాంపల్లి భరత్ సీసీ టీమ్ విజేతగా, మాసాబ్‌ట్యాంక్‌కు చెందిన రెడ్‌హిల్స్ టీమ్ రన్నరప్‌గా నిలిచాయి. విజేతలకు సికింద్రాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్‌యాదవ్ వచ్చిన నగదు (విజేతలకు రూ. 40వేలు, రన్నర్ టీమ్‌కు రూ. 20 వేలు) బహుమతితో పాటు ట్రోఫీని అమీర్‌పేట్ మాజీ కార్పొరేటర్ శేషుకుమారి అందజేశారు.

- అమీర్‌పేట్, జనవరి 28

పరుగుల వీరుడికి ఓయూలో సన్మానం

స్వామిని సన్మానిస్తున్న విద్యార్థి నాయకులు, చిత్రంలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, నందిని

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 28: అలుపెరగని పరుగుల వీరుడు స్వామిని ఉస్మానియా యూనివర్సిటీలో ఆదివారం సన్మానించారు. స్పోర్ట్స్ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరయ్యారు. బీఎస్ఎన్ఎల్‌లో జూనియర్ టెలికాం ఆఫీసర్‌గా పనిచేస్తున్న స్వామి ప్రతి రోజు అయిదు కిలోమీటర్ల దూరం నడుస్తూ వెయ్యి రోజులు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. శారీరక శ్రమ ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసియా క్రీడల విజేత నందిని అగసారా, ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు శాగంటి రాజేశ్, నాయకులు నాగరాజు గౌడ్, వినోద్, మహేందర్, మట్టపల్లి సతీశ్ గౌడ్, వెంకటేశ్‌యాదవ్, గణేశ్, భరత్, చందన్‌రెడ్డి, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

కుక్కల బెడదను నివారించాలి..

బీఆర్ఎస్ నేత అనిల్‌కుమార్

సికింద్రాబాద్, జనవరి 28: వీధి శునకాల బెడదను అధికారులు నివారించాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు మల్లూరి అనిల్‌కుమార్ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. చిలకలగూడ, సీతాఫల్‌మండి, వారాసిగూడ , ఇందిరానగర్ కాలనీ, శ్రీనివాస్‌నగర్ కాలనీ, మహ్మద్‌గూడ, షాబాద్‌గూడ ప్రాంతాల్లో వీధి శునకాలు తిరుగుతూ పాదచారులు, వాహనదారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు వివరించారు. వృద్ధులు, విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నట్లు చెప్పారు. రోడ్లపై వెళ్లే వారిపై దాడులకు దిగి గాయపర్చుతున్నట్లు చెప్పారు. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 28: నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి, బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డిలను ఆదివారం మల్లాపూర్‌కు చెందిన పలువురు కార్మిక సంఘ నాయకులు కలిసి తమ సమస్యలను వివరించారు. తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో వారిని కలిసి.. తమకు మెడికల్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. దీనికి వారు సానుకూలంగా స్పందించారని చెప్పారు.



డిప్యూటీ మేయర్ దంపతులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్మిక నేతలు

ముగిసిన వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న గాంధీ దవాఖాన అనస్థీషియా విభాగం వైద్యులు

బన్సీలాల్‌పేట్, జనవరి 28 : నడుము , మోకాలి నొప్పుల నివారణకు అందిస్తున్న చికిత్సలో నూతన పద్ధతులపై అనస్థీషియా ఫిజిషియన్ల కోసం నిర్వహించిన రెండు రోజుల వర్క్‌షాప్ ఆదివారం ముగిసింది. గాంధీ పూర్వ విద్యార్థి, అమెరికాలో స్థిరపడిన డాక్టర్ రామ్ పసుపులేటి సహకారంతో గాంధీ దవాఖాన అనస్థీషియా విభాగం ఆధ్వర్యంలో జరిగిన శిబిరానికి వివిధ జిల్లాల నుంచి వచ్చిన 150 మంది అనస్థీషియా ఫిజిషియన్లకు నొప్పి నివారణ చికిత్సపై అవగాహన కల్పించారు. అనంతరం గాంధీ వైద్య కళాశాల అలుమ్ని భవనంలోని సెమినార్ హాల్‌లో పలువురు అనస్థీషియా ఫిజిషియన్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. గాంధీ వైద్య కళాశాల అలుమ్ని సంఘం ప్రతినిధులు డాక్టర్ లింగయ్య, గాంధీ దవాఖాన అనస్థీషియా విభాగం ప్రొఫెసర్ పి.శ్రీదేవి, నిర్వాహక కమిటీ ప్రతినిధులు డాక్టర్ నాగార్జున, డాక్టర్ మురళీధర్, డాక్టర్ నాగరాజు, డాక్టర్ ఇబ్రహీం జుబేర్, డాక్టర్ అబ్బయ్య, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ సారయ్య, డాక్టర్ ఎంఎ.సమద్, డాక్టర్ మదన్, డాక్టర్ కిరణ్, డాక్టర్ పద్మావతి పాల్గొన్నారు.

స్కై ఫౌండేషన్ అన్నదానం ..

పద్మారావునగర్‌కు చెందిన స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. రోడ్ల పక్కన ఉంటూ ఆకలితో అలమటించే వృద్ధులు, నిరాశ్రయులు, దివ్యాంగులను అప్యాయంగా పలకరించి వారికి భోజనం సమకూర్చామని స్కై ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై.సంజీవ్ కుమార్, ఉపాధ్యక్షురాలు పావని తెలిపారు. సభ్యులు నేహా, అఖిల్, ఇర్ఫాన్, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

- బన్సీలాల్‌పేట్, జనవరి 28

ఉచిత వైద్య శిబిరం..

పల్లవి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్ ప్రో వైస్ చైర్మన్ మల్కా కొమరయ్య నేతృత్వంలో నోవాకేర్ హాస్పిటల్స్ సహకారంతో ఆదివారం బోయిన్‌పల్లిలోని పల్లవి మోడల్ స్కూల్‌లో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి 250 మందికి పైగా హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో నోవాకేర్ హాస్పిటల్ సీఈఓ డాక్టర్ ప్రమోద్ గుప్తా (ఎండీ ఫిజిషియన్), డాక్టర్ హాసిని చిట్టప రెడ్డి(గైనకాలజిస్ట్), డాక్టర్ తేజస్విని (జనరల్ ఫిజిషియన్) వైద్య సేవలు అందించారు.

- కంటోన్మెంట్, జనవరి 28

కిషన్‌రెడ్డి ఓటమే లక్ష్యంగా ..

తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు హసేన్

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 28: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ స్థానం నుంచి కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఓటమే లక్ష్యంగా ప్రచారం నిర్వహించనున్నట్లు తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల్ల హసేన్ తెలిపారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చినప్పటికీ, దానిని గౌరవించకుండా కిషన్ రెడ్డి మాట్లాడడం సరికాదన్నారు. వర్గీకరణ అంశాన్ని ఎన్నికలకు ముందు రాజకీయ అస్త్రంగా ఆయన వాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పేద ఓసీలకు పది శాతం రిజర్వేషన్లు కల్పించిన బీజేపీ ప్రభుత్వం ఎస్సీల రిజర్వేషన్లను పెంచాలన్నారు. ఐకమత్యంగా ఉన్న ఎస్సీలను తమ స్వప్రయోజనాల కోసం వర్గీకరించాలని చూస్తే బీజేపీని దళితులు ఓడిస్తారని హెచ్చరించారు. నిజంగా ఎస్సీల అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే రిజర్వేషన్లను ఇరవై శాతానికి పెంచాలని అన్నారు. ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు కల్పించాలని సూచించారు. మూసివేసిన పరిశ్రమలను పునరుద్ధరించాలని కోరారు.

నేడు కాంగ్రెస్ బూత్ కమిటీ సమావేశం

సికింద్రాబాద్, జనవరి 28: కాంగ్రెస్ పార్టీ బూత్ కమిటీ సమావేశాన్ని నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకుడు కొండల్ వెంకటేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం జరిగే సమావేశానికి నాయకులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. ఉదయం 10 గంటలకు నామాలగుండులోని బీఎన్ ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో సీనియర్ నాయకుడు ఆదం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో బూత్ కమిటీ సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, సీనియర్ నాయకులు హాజరవుతారని తెలిపారు.

విలువలతో కూడిన విద్యాబోధన అందించాలి

బొల్లారం, జనవరి 28 : జాతీయ విద్యా విధానంలో ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని ఎన్ఈఓ 2020 నుంచి కేంద్ర ప్రభుత్వం విద్యా విధానంలో పలు మార్పులు తీసుకొచ్చిందని మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు అన్నారు. ఆదివారం తిరుమలగిరి కేంద్రీయ విద్యాలయంలో ఉపాధ్యాయుల అసోసియేషన్ హైదరాబాద్ రీజియన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సదుస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాంచందర్ రావు మాట్లాడుతూ.. దేశ భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదన్నారు. విద్యార్థులకు సమాజంలో విలువలతో కూడిన విద్యా బోధన అందిస్తే, భావి భారత పౌరులుగా ఎదుగుతారని సూచించారు. కార్యక్రమంలో అగర్వాల్, టి.వెంకటేశ్, రీజినల్ ప్రతినిధులు వెంకటేశ్వర్లు, రంగస్వామి, సుందర్ రావు, రంగయ్య,మధుసూదన్ పాల్గొన్నారు.

తిరుమలగిరి కేంద్రీయ విద్యాలయంలో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు,ఉపాధ్యాయ సిబ్బంది

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు ..

న్యూ బోయిన్‌పల్లి కడక్‌పురాలో బోర్‌వెల్ పనులను ప్రారంభిస్తున్న కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి

కంటోన్మెంట్, జనవరి 28 : కంటోన్మెంట్ పరిధిలోని ఒకటో వార్డులో నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నట్లు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే కోటా కింద మంజూరైన నిధులతో ఒకటో వార్డులోని న్యూ బోయిన్‌పల్లి నేతాజీ నగర్ కడక్‌పురాలో నూతన బోర్‌వెల్ పనులను స్థానిక బస్తీ వాసులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే వార్డులోని పలు ప్రాంతాల్లో నూతన బోర్‌వెల్‌లు వేయించి.. నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో సయ్యద్ అరీఫ్, ఇక్బాల్, ముక్తార్, శంషద్, అషూ, రిజ్వాన్, అస్లాం, చోటు, సిరాజ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో.. మౌలిక వసతులు కల్పించాలి

ఖైరతాబాద్, జనవరి 28 : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ధర్మ టీచర్స్ యూనియన్ (డీటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు పాక లింగమల్లు యాదవ్ కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సర్కారు బడుల్లో వసతులు లేక డ్రాపౌట్స్ పెరుగుతున్నాయని, మరుగుదొడ్ల సౌకర్యం లేక ఆడపిల్లలు పాఠశాలలకు రావడం లేదన్నారు. ఐటీ రంగం విస్తరిస్తుందని చెప్పుకుంటున్న తరుణంలో రాష్ట్రంలోని సుమారు పదివేల పాఠశాలల్లో కంప్యూటర్లు అటకెక్కాయన్నారు. ఇతర దేశాల్లో 12వ తరగతి స్థాయిలోనే సాంతికేక విద్య, వృత్తినైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తారని, అలాంటి శిక్షణ తరగతులను ఇక్కడి విద్యార్థులకు అందించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ ప్రకటనకే పరిమితం కావద్దన్నారు. తమిళనాడులో పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నారని, అలాంటి పద్ధతిని ఇక్కడ తీసుకురావాలని, దాని పర్యవేక్షణకు ఐఏఎస్ అధికారిని నియమించాలన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు, ఎంఈవో, డిప్యూటీ ఈవో పోస్టులను భర్తీ చేయాలన్నారు. మల్టీ జోనల్-2లో ఆగిపోయిన గెజిటెడ్ హెడ్మాస్టర్, స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతులకు షెడ్యూల్ విడుదల చేయాలన్నారు. బదిలీ అయి రిలీవ్ కాని ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలన్నారు.

పరిధి తగ్గినా.. పెరుగుతున్న కేసులు

నెలరోజుల్లోనే 100కి పైగా కేసులు

- మూడు పీఎస్‌లలో 100కు పైగా ఎఫ్ఐఆర్‌ల నమోదు
- వెస్ట్‌జోన్ పరిధిలో భారీగా పెరుగుతున్న కేసుల సంఖ్య

బంజారాహిల్స్,జనవరి 28: వెస్ట్‌జోన్ పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్లలో కేసుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. జనవరి నెలలో ఇప్పటికే వెస్ట్‌జోన్ పరిధిలోని మూడు పోలీస్‌స్టేషన్లలో ఎఫ్ఐఆర్‌ల సంఖ్య 100 దాటడం చర్చనీయాంశంగా మారింది. బంజారాహిల్స్, పంజాగుట్ట, జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లలో ఇప్పటికే 100 కేసులకు పైగా నమోదు కాగా సంజీవ్‌రెడ్డినగర్ పీఎస్‌లో సుమారు 95కు పైగా కేసులు నమోదయ్యాయి. గతంలో అతిపెద్ద పోలీస్‌స్టేషన్లుగా ఉన్న బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఎస్ఆర్‌నగర్, పంజాగుట్ట పీఎస్‌లలో ఏడాదికి 750 నుంచి 1150 వరకు కేసులు నమోదయ్యేవి. దాంతో కేసుల విచారణలో జాప్యం జరిగేది. నెలవారీగా కేసుల పురోగతిపై సమీక్ష నిర్వహించి పెండింగ్ కేసుల రేషియోను తగ్గించేందుకు ఉన్నతాధికారులు ఒత్తిడి తీసుకొచ్చేవారు. అయితే పరిమితికి మించి కేసులు నమోదు కావడంతో పాటు బందోబస్తులు, పండుగల కోసం ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్ల కోసం ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, ఇతర సిబ్బంది సమయాన్ని వెచ్చించాల్సి రావడంతో పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గించే లక్ష్యంతో ఆయా పీఎస్‌లలోని కొన్ని ప్రాంతాలను తీసి కొత్తగా ఫిలింనగర్, మాసాబ్‌ట్యాంక్, మధురానగర్, బోరబండ పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. ఒక్కో పీఎస్‌లో ఉన్న సిబ్బంది, పరిధిని దృష్టి లో ఉంచుకుని ఏడాదికి 350నుంచి 450 కేసులు నమోదైతేనే సరైన రీతిలో దర్యాప్తు జరగడంతో పాటు కన్విక్షన్ రేటును పెంచేందుకు వీలువుతుందనే ఉద్దేశంలో కొత్త పీఎస్‌లు ఏ ర్పాటు చేశారు. నెల రోజులుగా వెస్ట్‌జోన్ పరిధిలోని 5 పోలీస్‌స్టేషన్ల పరిధిలో కేసుల సంఖ్య పెరుగుతుండడంపై 'నమస్తే తెలంగాణ పత్రిక ' పరిశీలనలో పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి.

ఎఫ్ఐఆర్ చేసి తీరాల్సిందే..

గతంలో ఎన్నడూ లేని విధంగా కేసుల సంఖ్య పెరిగిపోతుండానికి ఇటీవల ఉన్నతాధికారుల నుంచి వచ్చిన మౌఖిక ఆదేశాలే కారణమని తెలుస్తోన్నది. గతంలో చిన్నచిన్న రోడ్డు ప్రమాదాలు జరిగితే ఫిర్యాదు దారులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదులు చేయడంతో జీడీ ఎంట్రీ పెట్టి ప్రాథమిక విచారణ చేపట్టేవారు. ప్రమాదంలో వాహనాలకు జరిగే నష్టాన్ని తాము రిపేర్ చేయించి ఇస్తామని నిందితులు చెప్పడంతో చాలావరకు ఫిర్యాదు దారులు కేసులు వెనక్కి తీసుకునేవారు. అయితే ప్రస్తుతం మారిన పరిస్థితుల కారణంగా ఎంత చిన్న ప్రమాదమైనా ఎఫ్ఐఆర్ చేసి పారేస్తున్నారని, దాంతో తమకు రావాల్సిన నష్ట పరిహారం రాకపోగా కోర్టు చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వస్తుందని బాధితులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెస్ట్‌జోన్ పరిధిలో గత నెలరోజుల్లో నమోదైన కేసుల్లో 30శాతం కేసులు ఇలాంటి చిన్నకేసులే అని తెలుస్తోంది. దీంతో పాటు గతంలో బైక్ చోరీలు జరిగిందని ఫిర్యాదులు చేస్తే ప్రాథమికంగా విచారణ చేసి నాలుగైదు రోజులు ఆయా పోలీస్‌స్టేషన్లలో క్రైం సిబ్బంది వాటి ఆచూకీ కనుక్కుని అప్పగించేవారు. దీనివల్ల ఎఫ్ఐఆర్ చేసి విలువైన సమయాన్ని వృథా జరగకుండా చూసుకునేవారు. అయితే ఇప్పుడు బైక్ చోరీకి సంబంధించిన బాధితులు ఫిర్యాదులు చేసిన నిమిషాల్లోనే ఎఫ్ఐఆర్ చేతుల్లో పెడుతున్నారు. తీరా సాయంత్రానికి బైక్ దొరికినా దాన్ని విడిపించుకోవాలంటే కోర్టు ద్వారానే సాధ్యం అవుతుండడంతో ఫిర్యాదు దారులు లబోదిబోమంటున్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్ తదితర పోలీస్‌స్టేషన్లలో గత నెలరోజుల్లో సుమారు 30నుంచి 40దాకా బైక్‌లు మాయమవగా వాటిలో సగానికి సైగా రెండ్రోజుల్లోనే దొరికినా బాధితులకు అప్పగించలేని పరిస్థితి నెలకొంది.